వార్డు కార్యాలయానికి స్థలం కేటాయించాలి

కాప్రా: డివిజన్ నూతన వార్డు కార్యాలయానికి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మాను చౌదరికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. స్థలం కేటాయిస్తే నిధులు సమకూర్చుకుని కాప్రా వార్డు ఆఫీసు నిర్మాణం చేపడతామన్నారు.

గ్రూప్‌-1 విజేతకు సత్కారం

కుషాయిగూడ: గ్రూప్‌-1లో 303 ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికైన చర్లపల్లి డివిజన్, నాగర్జుననగర్ కాలనీకి చెందిన ధీరావత్ సబితను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. బీఆర్‌ఎస్ నేతలు పాండాల శివకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

అల్వాల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేరెడ్‌మెట్ ఎస్సై సాయిఅవినాష్ అన్నారు. శుక్రవారం నేరెడ్‌మెట్ డిఫెన్స్ కాలనీలోని నార్త్ పార్కులో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, నేరెడ్‌మెట్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైం పట్ల అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అనుమానితులు ఫోన్‌చేస్తే బ్యాంక్ వివరాలు, తదితర వాటిని తెలియచేయవద్దన్నారు. ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటియం, ఫోన్‌పే, గూగుల్‌పే, ఈ–కేవైసీ అప్‌డేట్ వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు –1930 టోల్‌ఫ్రీ నెంబరుకు వెంటనే డయల్ చేసి ఫిర్యాదు చేయాలని వివరించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ఉప్పల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళా విజయవంతమైంది. దాదాపు 15 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన జాబ్‌మేళా సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. 87 మంది జాబ్‌మేళాకు హాజరు కాగా.. 82 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ఉప్పల్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, విశ్రాంత ఉద్యోగులందరికీ సమాన హక్కులు కల్పించాలని 'సర్వే ఆఫ్ ఇండియా' పెన్షనర్ల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాలిడేషన్ సాకుతో పెన్షనర్లను మోసం చేస్తున్నారని, రిటైర్‌మెంట్ తేదీకి సంబంధం లేకుండా అందరికి సమాన అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలో న్యూ శాంతినగర్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, కాంగ్రెస్ నేతలు రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, సతీష్‌కుమార్, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులు రూపొందించిన దియాల ప్రదర్శన

కాప్రా: అనురాగ్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో దీపావళి సందర్భంగా దివ్యాంగులచే దియాలను తయారు చేయించారు. నేడు, రేపు సైనిక్‌పురి, హెచ్‌బీఎల్ బ్రాంచ్‌లలో ప్రదర్శనలో ఉంచుతామని, స్టాల్స్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. దివ్యాంగులు స్వయంగా దీపావళి దియాలకు రంగులు, కొవ్వొత్తులు, ఫినాయిల్, పేపర్‌బ్యాగ్ ఆక్టివిటీస్‌లను ప్రదర్శించారు. రాజశేఖర్, డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువు (లేక్ పార్క్)కు సంబంధించి నెలలోగా పెండింగ్ పనులు పూర్తిచేయాలని హెచ్‌ఎండీఏ అధికారులను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ హెచ్చరించారు. శుక్రవారం హెచ్‌ఎండీఏ, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అధికారుల మధ్య సమన్వయ లోపంతో జరగాల్సిన అభివృద్ధి జరగడం లేదన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే స్థానికులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. హెచ్‌ఎండీఏ డీఈ రామారావు, జీహెచ్‌ఎంసీ ఈఈ లక్ష్మణ్, జలమండలి జీఎం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కొత్త' పాట్లు !

పారిశుద్ధ్య కార్మికులకు కొత్త హాజరు నిబంధన

- ఉదయం ఐదు గంటలకే ఫేస్ రికగ్నైస్ అటెండెన్స్
- ఉప్పల్‌లో మహిళా కార్మికులే విధి నిర్వహణలో అధికం
- పాత విధానాన్నే కొనసాగించాలని విజ్ఞప్తి


రహదారులను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రామంతాపూర్: జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్‌లో ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్లలో దాదాపు 500 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు పారిశుద్ధ్య కార్మికులుగా ప్రధాన రహదారులు, కాలనీల్లోని అంతర్గత రహదారులతో పాటు ఇతర రోడ్లపై ఉన్న వ్యర్థాలను తీసివేయడం వంటి విధులు ఉదయం 5 గంటల నుంచే ప్రారంభిస్తారు.

☛ వీరంతా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారే. కొంతమంది పారిశుద్ధ్య కార్మికులు దూర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహించే వారున్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1–2 గంటల వరకు విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు ఇటీవల జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు తీసుకొచ్చిన కొత్త అటెండెన్స్ నిబంధనలతో ఇబ్బంది పడుతున్నారు.

☛ గతంలో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఫేస్ రికగ్నైషన్ సిస్టమ్‌తో కార్మికుల హాజరు తీసుకునేవారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు మరో మారు మధ్యాహ్నం ఒంటి గంటకు హాజరు తీసుకునే విధానం అములులో ఉండేది. ప్రస్తుతం ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 5.30 వరకు మాత్రమే కార్మికుల హాజరు తీసుకోవాలంటూ సమయాన్ని అరగంటకు కుదిస్తూ.. కొత్త నిబంధనలు అమలుచేయాలని ఇటీవల జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం.

దూర ప్రాంతాల వారికి ఇబ్బంది..

ఎస్‌ఎఫ్‌ఏలు తెల్లవారు జామున 5.00 నుంచి 5.30 వరకు కార్మికుల హాజరు తీసుకోవడం ప్రారంభించగా.. ఈ కొత్త నిబంధనతో 20 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే కార్మికులు ఈ కొత్త నిబంధనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారు జామున బస్సులు అందుబాటులో లేకపోవడంతో సకాలంలో విధులకు హాజరు కాలేకపోతున్నారు. ఈ కొత్త నిబంధన సోమవారం అమల్లోకి వచ్చింది. ఆలస్యమవడంతో గైర్హాజరు..

☛ చాలామంది పారిశుద్ధ్య సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడంతో ఎస్‌ఎఫ్‌ఏలు వారికి గైర్హాజరు వేశారు. దీంతో ఒకరోజు జీతం నష్టపోవాల్సి వచ్చిందని వారు వాపోతున్నారు. తరచూ అటెండెన్స్ విధానంలో మార్పులు చేర్పులు చేయడం వల్ల తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత హాజరు విధానాన్ని అమలుచేయాలని పలువురు పారిశుద్ధ్య కార్మికులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు కోరుతున్నారు.

కొత్త నిబంధనలతో అవస్థలు



ఉదయం 5 గంటలకే అటెండెన్స్ తీసుకోవాలని ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు ఇచ్చిన ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత అటెండెన్స్ విధానాన్నే జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రవేశపెట్టాలి. లేదంటే ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆందోళన నిర్వహిస్తాం.

– శ్రీనివాస్, ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా


ప్రమాద బీమా బాండ్ల పంపిణీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో చేపట్టిన వ్యక్తిగత ప్రమాదబీమా బాండ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. వార్త సేకరణలో పాత్రికేయులు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారన్నారు. విలువలతో కూడిన జర్నలిస్టులకు ఎప్పుడూ.. గుర్తింపు ఉంటుందన్నారు.

ప్రెస్‌క్లబ్ సభ్యులకు ప్రమాద బీమా..

ప్రెస్‌క్లబ్ సభ్యులకు వ్యక్తిగత ప్రమాదబీమాను పాండాల శివకుమార్‌గౌడ్ చేయించారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి సహకారం అందించిన మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి, వంజరి ప్రవీణ్, రాఘవరెడ్డి, బండే గౌడలను ఆయన అభినందించారు. సీనియర్ జర్నలిస్టులు వెంకట్‌రెడ్డి, మలక్కయ్య, శ్రీనివాస్‌గౌడ్, కేసీ మోహన్, సత్యనారాయణ, సహదేవచారి, జ్యోతిర్మయచారి, చంద్రమౌలి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై పాదయాత్ర..

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ద్వారకపురి కాలనీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గుతుకుల రోడ్లతో పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. వర్షం పడితే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ.. నెలరోజుల్లో ద్వారకపురికాలనీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, కాలనీవాసులు శివశంకర్‌రెడ్డి, సుబ్బారావు, దేవేందర్, శివసాయి, చంద్రకళ, నవిత తదితరులు పాల్గొన్నారు.


ద్వారకపురి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల గ్యారంటీ కార్డు ప్రకారం ఇవ్వాల్సిన కాంగ్రెస్ 'బాకీ కార్డు' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం నయవంచన చేసిందని ఆరోపించారు. మహిళలకు రూ.2500లు, వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు పెన్షన్ పెంపు, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి కృష్ణ, నేతలు కొత్త రవిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, విశ్వనాథం, కాటం రాజిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, రవి కుమార్, చంటి శ్రీనివాస్ తదితరులున్నారు.


'బాకీ కార్డు' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంజీవ్‌రెడ్డి

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బంగారు మైసమ్మ దేవాలయం నుంచి చెంగిచర్ల సాయి రెసిడెన్సీ వరకు రూ.10 కోట్లతో చేపడుతున్న 60 ఫీట్ రోడ్డు విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ్మా, సుమన్‌నాయక్, నేతలు పులకండ్ల జంగారెడ్డి, కుర్రి శివశంకర్, రంగ బ్రహ్మన్నగౌడ్, బింగి యోగేష్ యాదవ్ పాల్గొన్నారు.

మార్జిన్ తగ్గించడంతో తీవ్రంగా నష్ట పోతున్నాం..

చికెన్ సెంటర్ నిర్వాహకుల ఆవేదన



బోడుప్పల్: చికెన్ సెంటర్ నిర్వాహకులకు కోళ్ల ఫారం యజమానులు ఇచ్చే మార్జిన్ అమౌంట్ తగ్గించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చికెన్ సెంటర్ నిర్వాహకులు సంజీవ్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బోడుప్పల్ బొమ్మక్ బాలయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర చికెన్‌సెంటర్ అసోసియేషన్ సభ్యుల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. కోళ్లను సరఫరా చేసే 26 కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి తమకు ఇచ్చే మార్జిన్ అమౌంట్‌ను 50 శాతం తగ్గించాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చికెన్ సెంటర్ నిర్వహించే నిర్వాహకులు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వచ్చే మార్జిన్‌తో చికెన్ సెంటర్‌కు అద్దె, నీటి బిల్లు, కరెంట్ బిల్లు, పనిచేసే వారి జీతాలతో పాటు తమ కుటుంబాల పోషణ భారంగా మారుతోందన్నారు. కోళ్ల ఫారాల యజమానులు తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరిగా మార్జిన్ ఇచ్చే విషయాన్ని పునరాలోచించుకోవాలని కోరారు. కమిటీ ప్రతినిధులు విజయకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వరుణ్‌యాదవ్, ఎస్‌కే.జాకీర్, మధుకర్ రెడ్డి, అనంత్‌రెడ్డి, చందు పాల్గొన్నారు.

అధికారులతో కమిషనర్ సమీక్ష


సమాచార వారోత్సవాల్లో పాల్గొన్న కమిషనర్ శైలజ

బోడుప్పల్: రేపు జరగనున్న పల్స్ పోలియోపై కమిషనర్ శైలజ సంబంధితశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. చెంగిచర్ల, బోడుప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. 0–5 ఏళ్ల లోపున్న పిల్లలు పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌రావు, మేనేజర్ ప్రవీణ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో సమాచార వారోత్సవాలు..

నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సమాచార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. సమాచారం హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లక్ష్మీనరసింహ ఫీడర్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్‌పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

☛ 11 కేవీ భవానీనగర్ ఫీడర్ పరిధిలో 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

బోడుప్పల్: ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు.

మల్కాజిగిరి: గౌతంనగర్ (మీర్జాలగూడ) సబ్‌స్టేషన్ 11 కేవీ హనుమాన్‌పేట్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మల్లికార్జుననగర్, హనుమాన్‌పేట్ విద్యుత్ సరఫరా ఉండదని లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు.



ఘనంగా మానసిక ఆరోగ్య దినోత్సవం

మల్లాపూర్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాచారం సాధన మానసిక దివ్యాంగుల సంస్థలో నిర్వహించిన కార్యక్రమానికి సీనియర్ డిస్ట్రిక్ లీగల్ సర్వీస్, జడ్జి కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు సాధన సంస్థ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందిచారు. న్యాయపరంగా మానసిక దివ్యాంగులకు తమవంతు సాయం చేస్తామన్నారు. రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణప్రసాద్, సాధన సంస్థ డైరెక్టర్ సురేఖరెడ్డి, సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాప్రాలో..

పీహెచ్‌సీ కుషాయిగూడలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రోగాం ఆఫీసర్ మల్లేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో అడ్వకేట్‌పై దాడి

అల్వాల్: వివాదాస్పద స్థలంలో అడ్వకేట్‌పై దాడి జరిగిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్మత్‌పేట్‌లోని సర్వేనెంబర్ 1లోని స్థలం కొంతకాలంగా వివాదాస్పదంగా ఉంది. సదరు స్థలం తనదేనంటూ నగరానికి చెందిన న్యాయవాది మొయినుద్దీన్ పత్రాలు చూపడంతో పాటు కోర్టులో కేసు వేశారు. సదరు స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయనే సమాచారంతో శుక్రవారం ఆయన వారిని ప్రశ్నించడంతో మాటమాట పెరిగి ఇరు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో న్యాయవాదిపై దాడి చేయడంతో పాటు కారుపై రాళ్లు విసిరారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయవాదే అసభ్య పదజాలంతో దూషిస్తూ.. దాడికి యత్నించారని, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు !

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలకు డిమాండ్

కుషాయిగూడ: కాప్రా మండలం, కుషాయిగూడ సర్వేనెంబరు 376లోని అసైన్డ్ భూమిని కబ్జాచేసి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏకంగా రూ.50 కోట్లు విలువ చేసే స్థలం అన్యాక్రాంతమవుతున్నా.. అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. కోట్లాది రూపాయాల విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

☛ కుషాయిగూడ, జమ్మిగడ్డ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 376లో సుమారు 16 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు సమాచారం. ఈ కబ్జా బాగోతాన్ని గమనించిన సీసీఎస్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీఆర్‌ఓ, ఆర్‌డీఓలతో పాటుగా జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది.

అక్రమ నిర్మాణాలను పరిశీలించిన తహసీల్దార్..

ఈ విషయంపై అడిషనల్ కలెక్టర్ ఆర్‌డీఓకు ఆదేశాలివ్వడంతో శుక్రవారం సాయంత్రం హుటాహుటీన కాప్రా తహసీల్దార్ సుచరిత సిబ్బందితో కలిసి జమ్మిగడ్డలోని అసైన్డ్ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను సందర్శించారు. వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. సర్వే నెంబరు 376లో ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులకు 22–ఏ అందజేసినట్లు ఆమె పేర్కొనడం గమనార్హం.



కఠిన చర్యలు తీసుకోవాలి..

కోట్లాది రూపాయాల విలువ చేసే ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ, కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీసీఎస్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు

కాప్రా: కుషాయిగూడలో అసైన్డ్ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా తహసీల్దార్ సుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం కుషాయిగూడ జమ్మిగడ్డ అసైన్డ్ భూముల్లో వెలిసిన నిర్మాణాలపై అందిన ఫిర్యాదు మేరకు ఆమె పర్యటించారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్, హెలెన్ కెల్లెర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నగరంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఎన్నో ఒత్తిడిలకు గురౌతూ.. రకరకాల మానసిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వారిలో మనోస్థైర్యాన్ని నింపాల్సింది సైకాలజిస్ట్ లేనని చెప్పారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. లయన్ పఠాన్ ఉమార్‌ఖాన్, డాక్టర్ మోత్కూరి రాంచందర్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై..

మల్కాజిగిరి: మల్కాజిగిరి జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు (సివిల్ అప్పీల్ నెం:8558/2018) అమలు చేస్తే ఉద్యోగులకు మేలు జరుగుతుందని ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులతో చర్చించి సమాన పనికి సమాన వేతనంతో పాటు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించడంలో ఉన్న అడ్డంకులను తెలుసుకుంటానన్నారు. అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గిరి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరమణ, వెంకటేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు


ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో ఎమ్మెల్యే

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ..

మల్కాజిగిరి: డివిజన్‌కు చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ ఆసరాగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూర్యకళకు రూ 50 వేలు, రవీందర్‌కు రూ. 48 వేలు మంజూరయ్యాయని మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ వివరించారు.